ప్రజాశక్తి
బుధవారం 26 ఫిబ్రవరి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ముగిసిన ప్రచార ఘట్టం

- పోలింగ్‌కు కౌంట్ డౌన్ ◆ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో త్రిముఖ పోటీ
- మండలి ఎన్నికలను 'కూటమి' రాజకీయం చేయడంపై ఉపాధ్యాయుల్లో ఆవేదన
- ప్రశ్నించే గళాన్ని గెలిపించుకునే ఆలోచనలో గురువులు
- పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి సర్వత్రా సానుకూలత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ప్రచార ఘట్టానికి మంగళవారం సాయంత్రం 4 గంటలతో తెరపడింది. గతంకంటే భిన్నంగా ఈసారి ఎన్నికల ప్రచార శైలి నడిచింది. ఉపాధ్యాయులతో పాటు అందరిలో ఈ ఎన్నికలు ఆసక్తి రేకెత్తించాయి. మేధావుల సభకు మేధావులను పంపాల్సిన ఎన్నికలను కూడా రాష్ట్రంలోని 'కూటమి' పార్టీలు ముఖ్యంగా తెలుగుదేశం పూర్తిగా రాజకీయం చేసిందన్న భావన టీచర్లలో వ్యక్తమవుతోంది. తాజా ఎన్నికలకు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 34 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో గల 22493 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని శాసన మండలి (పెద్దల సభ)కు తమ ప్రతినిధిని ఈ నెల 27న ఎన్నుకోనున్నారు. 13,508 మంది పురుష

రఘువర్మ

శ్రీనివాసుల నాయుడు

విజయగౌరి

ఓటర్లు, 8985 మంది మహిళా టీచర్లు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. వారు ఎవరిని గెలిపించనున్నారో మార్చి 3న స్పష్టం కానుంది.

ఎవరి నినాదాలేమిటి ?

'కూటమి' బలపరిచిన పాకల పాటి రఘువర్మ ఇంకోసారి గెలిపించండని, బిజెపి మద్దతునిస్తున్న గాదె శ్రీనివాసులనాయుడు తనను మూడోసారి మండలికి పంపండని సాగిస్తున్న ప్రచారం ఉపాధ్యాయులను ఆకట్టు కోలేకపోయింది. రాజకీయ పార్టీల అండతో వారు సాగడం, పదవుల్లో ఉన్న కాలంలో వారు ఉపాధ్యాయవర్గానికి ఏమీ చేయకపోవడం అందుకు కారణంగా కనిపిస్తోంది. అదే సమయంలో ఒక్క మిగతా 2లో..

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఉత్తరాంధ్రలో 123 పోలింగ్ కేంద్రాలు
- అన్నిచోట్లా పటిష్ట పోలీసు బందోబస్తు
- రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 27న జరుగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22,493 మంది ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. వారు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు ఉంటాయన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పిరియడ్ ఉంటుందని స్పష్టం చేశారు. ఆ సమయంలో ప్రచారాలు చేయరాదని తెలిపారు.

ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు 739 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించామని అన్నారు. ఓటర్ స్లిప్పులను ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. శ్రీకాకుళంలో 31, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విశాఖపట్నంలో 13, అనకాపల్లిలో 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. పోలింగ్ ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతుందని, దీనికి సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలనూ అధికార యంత్రాంగం మొదలు పెట్టిందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని రకాల మిగతా 2లో..

ఏర్పాట్ల వివరాలను తెలియజేస్తున్న ఆర్ఒ హరేంధిర ప్రసాద్

నేడు ఆర్‌కె బీచ్‌లో శివరాత్రి ఉత్సవాలు

▶ వార్త 2లో..

పల్సస్ హెల్త్ టెక్ ఐటి ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

▶ వార్త 2లో..

వ్యక్తి దారుణ హత్య

▶ వార్త మెయిన్‌లో..

ఆగిన పెద్దేరు, రైవాడ జలాశయ పనులు

- పునరుద్ధరణకు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు
- ప్రతిపాదనలపై కరువైన సానుకూలత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని సాగునీటి వనరుల అభివృద్ధికి కేటాయించిన నిధుల పనులు ముందుకు సాగడంలేదు. పెద్దేరు జలాశయ డిస్ట్రిబ్యూటరీ, రైవాడ జలాశయ డ్యామ్ పనులు కాలపరిమితిలో పూర్తికాలేదు. పెద్దేరు జలాశయ 1ఎల్ డిస్ట్రిబ్యూటరీలో 4ఎల్ (ఎ) పనుల కోసం గత ప్రభుత్వం 2023 జులై 13న రూ.9.12 కోట్లు మంజూరు చేసింది. శ్రీ సాయి లక్ష్మీ కనస్ట్రక్షన్స్ రూ.7.34 కోట్ల విలువైన పనులకు కాంట్రాక్ట్ దక్కించుకుంది. 2024 మార్చిలో పనులు అప్పగించినప్పటికీ 0.7 శాతం పనే జరిగింది. 25 శాతం కంటే పని తక్కువగా జరగడంతో కాంట్రాక్ట్ రద్దు చేయాలని గతేడాది సెప్టెంబరు 27న నీటిపారుదల శాఖాధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. పెద్దేరు కాలువలను ఆధునికీకరించి, మెరుగుపర్చే పనుల నిమిత్తం 2023 మార్చిలో రూ.84.40 కోట్లు మంజూరు చేశారు. శ్రీ సాయి లక్ష్మీ కనస్ట్రక్షన్స్‌నే రూ.71.59 కోట్ల విలువైన ఈ పనులను కూడా దక్కించుకుంది. 2.4 శాతం పని జరగకపోవడంతో కాంట్రాక్ట్ రద్దు చేయకుండా కొనసాగించాలని ప్రతిపాదనలు పంపారు. అయితే రెండు పనులకూ సంబంధించి పని రద్దు, పనులు కొనసాగింపు నిర్ణయం ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సివుంది. దీంతో అంతవరకు పనులు చేపట్టకుండా నిలిపివేశారు.

ప్రతిపాదనలకు దక్కని మోక్షం

జిల్లాలో భారీ నీటిపారుదల ప్రాజెక్టు తాండవ, మధ్య తరహా పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాలు, 2,880 చిన్న నీటి పారుదల వనరుల కింద 3.05 లక్షల ఎకరాల ఆయకట్టు వుంది. దీంట్లో తాండవ కింద 32,689 ఎకరాలు, పెద్దేరు, రైవాడ, కోనాం కింద 42,725 ఎకరాలు, చెరువులు, ఆనకట్టలు, గ్రోయిస్లు, చెక్‌డ్యామ్‌ల వంటి చిన్న నీటివనరుల కింద 2,30,579 ఎకరాలు సాగవుతోంది. పెద్దగా మిగతా 2లో..

సమస్యలపై గళమెత్తుతా.. అవకాశమివ్వండి

- విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా ◆ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. మంగళవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాసనమండలి అంటే పెద్దల సభని, అటువంటి సభలో పిడిఎఫ్ తరఫున గెలుపొంది ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న అభ్యర్థులు ఎంతో హుందాతనంగా, రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల, ఉద్యోగుల, పెన్షనర్ల, కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. పిడిఎఫ్ గత ఎమ్మెల్సీలూ ప్రజా గొంతుకగా నిలిచారన్నారు. శాసనమండలి ఉద్దేశాన్ని, హోదాను, ఉన్నతిని కాపాడి నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రతిరోజూ పోరాటం చేస్తున్న పిడిఎఫ్ తరుపున తాను పోటీ చేస్తున్నానని చెప్పారు. విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలపై తాను పోరాటం చేస్తానన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జిఒ 117 వల్ల అనేక పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలు మూతపడ్డాయని, తాము అధికారంలోకి వస్తే ఆ జిఒను రద్దు చేస్తామని గెలిచిన టిడిపి కూటమి ఆ తరువాత ఆ మాటను మరిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల ఉనికి లేకుండా మిగతా 2లో..

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

మొదటి పేజీ తరువాయి..

ముగిసిన ప్రచార ఘట్టం

అవకాశం తనకిస్తే విద్యారంగ పరిరక్షణ కోసం కృషి చేస్తానని, ఉపాధ్యాయ సమస్యలపై మండలిలో ప్రశ్నిస్తానని, వారి పోరాటాలకు అండగా ఉంటానని పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి చేసిన ప్రచారం అందరినీ ఆకట్టుకుంది. ఆమె తన ప్రచారంలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి గతంలో మండలిలో పిడిఎఫ్ సభ్యులు చేసిన కృషిని, తాను గెలిస్తే చేయబోయే పనిని ఉపాధ్యాయులకు తెలియజేశారు. యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా ఉన్న ఆమెకు సర్వత్రా సానుకూలత వ్యక్తమవుతోంది.

ముగ్గురి మధ్యనే పోటీ

ప్రధానంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, సిట్టింగ్ ఎంఎల్‌సి పాకలపాటి రఘువర్మ, మాజీ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసుల నాయుడు మధ్య పోటీ నెలకొంది. ప్రభుత్వం పట్ల టీచర్లలో వ్యతిరేకత మొదలు కావడం, కూటమి పార్టీల్లో టిడిపి, జనసేన రఘువర్మకు మద్దతుగా ప్రచారానికి దిగడం ఉపాధ్యాయుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. శాసన మండలి ఎన్నికలను పూర్తిగా రాజకీయ ఎన్నికలుగా మార్చేసి రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ కేడర్‌ను, నాయకులను, మంత్రులు, ఎంఎల్‌లు, ఎంపీలను రంగంలోకి తెలుగుదేశం, జనసేన దించడంతో టీచర్లలో ఒకరకంగా భయాందోళన కూడా నెలకొంది. ఇదంతా దేనికోసం ? విద్యారంగం భవిష్యత్తు ఏమౌతుంది ? పాఠశాలల పరిస్థితి ఏమిటి ? విద్యారంగ రక్షణ కోసం ఉద్యమించిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఒక మహిళ అన్న విషయాన్ని కూడా చూడకుండా ప్రధాన పార్టీలు ఇలా పోటీకి తెగబడడం సబబా ? అనే చర్చ సర్వత్రా నెలకొంది.

ఎన్నికల ముందు నాటి హామీలు అమలు చేయలేకేనా ?

16300 పైచిలుకు డిఎస్‌సి పోస్టులు గత నవంబర్‌లోగా రాష్ట్రంలో తీస్తామని హామీ ఇచ్చి తొలి సంతకం కూడా చేసిన చంద్రబాబు ఇంతవరకూ ఆ చొరవ చేయలేదు. ఈ అంశంపై ప్రశ్నించి డిఎస్‌సి సాధించే వరకూ పోరాడే వారు మండలికెళితే ప్రమాదమన్నది అధికార పార్టీకి బాగా ఎరుకే. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసుల నాయుడులో ఎవరు గెలిచినా కూటమికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. అదే సమయంలో ఈ ఇరువురిలో ఎవరు గెలిచినా ప్రమాదమే అన్న ఆందోళన ఉపాధ్యాయుల్లో నెలకొంది. ముఖ్యంగా గత జగన్ ప్రభుత్వంలో టీచర్లను అవస్థలు పాల్జేసిన 'ఫేషియల్ అటెండెన్స్'ను కూడా చంద్రబాబు సర్కారు వెనక్కి తీసుకోలేకపోయిందంటూ మాస్టారులంతా మండిపడుతున్నారు. అధ్యాపకులు, టీచర్లలో మహిళల సంఖ్య ఎక్కువే. ఈ నేపథ్యంలో విజయగౌరి పట్ల ఉపాధ్యాయుల్లో అపూర్వ స్పందన కనిపిస్తోంది.

సమస్యలపై గళమెత్తుతా.. అవకాశమివ్వండి

సన్నాహాలు చేస్తోందని తెలిపారు. అదే జరిగితే మరిన్ని పాఠశాలలు మూతపడటం, ఉపాధ్యాయుల పోస్టులు లేకుండా పోవడం తథ్యమన్నారు. దీంతో ప్రభుత్వ విద్య అందని ద్రాక్ష అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్సీగా నెగ్గితే జిఒ 117 రద్దుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. పవిత్రమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయని, రాజకీయ పార్టీలు జోక్యం ఈ ఎన్నికల్లో ఉండటం భావ్యం కాదని అన్నారు. తాను ఎన్నో మహిళా ఉద్యమాలలో పాల్గొని, ప్రజా సేవా కార్యక్రమాలు చేశానని తెలిపారు. మండలి ఎన్నికల్లో గెలిస్తే రాజకీయాలకు, అవినీతికి తావులేకుండా నిజాయితీగా సేవ చేస్తానని, పిఆర్‌సి, ఇతర సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయుల సమస్యలపై పనిచేసి పరిష్కారం దిశగా కృషి చేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఆరేళ్ల కాల ఉపాధ్యాయ వృత్తిని వదులుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చానన్నారు. విద్యారంగాన్ని దెబ్బతీసే పార్టీలు బలపరిచే అభ్యర్థుల వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. బ్యాలెట్ పేపర్‌లో 1వ నెంబర్‌లో ఉన్న తనకు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మీరాజా, విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి అంబేద్కర్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుధాకరరావు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

చర్యలూ చేపట్టామన్నారు. మార్చి 3న కౌంటింగ్ ప్రారంభమవుతుందని, 8తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని స్పష్టం చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసేందుకు అనువుగా ఎయు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి ఎయు ఇంజినీరింగ్ కళాశాల వద్ద పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందజేస్తారని చెప్పారు. అలాగే గురువారం సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది నుంచి రిసెప్షన్ కేంద్రం వద్ద మెటీరియల్ స్వీకరిస్తారని పేర్కొన్నారు. మెటీరియల్‌ను, సిబ్బందిని తరలించేందుకు అనువుగా తగినన్ని వాహనాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అన్ని జిల్లాలకు తగినంత మెటీరియల్ సిద్ధం చేశామని చెప్పారు.

ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగినంత మందిని నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రం లోపలికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హోటళ్లు, లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లలో ముందస్తు తనిఖీలు నిర్వహిస్తామని, అనుమానిత వ్యక్తులు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సైలెంట్ పిరియడ్ అమల్లో ఉన్న సమయంలో బయట జిల్లాల వ్యక్తులు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఉండరాదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎఆర్ఓ, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, తూర్పు ఎసిపి అన్నెపు నరసింహమూర్తి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి

విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. మంగళవారం మధ్యాహ్నం ప్రచార ప్రక్రియ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థులు అనుసరించవలసిన విధానాలపై అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకంలో అనుమతుల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని, ఎలాంటి సమన్వయ లోపమూ లేకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ ఏజెంట్లకు సంబంధించి గుర్తింపు కార్డులు పొందేందుకు ముందుగా దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రానికి ఉదయం 7 గంటలకల్లా చేరుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌నకు 200 మీటర్ల దూరంలో ఓటరు స్లిప్పులను అందజేయవచ్చన్నారు. షామియాలను వేయరాదన్నారు.

పల్సస్ హెల్త్ టెక్ ఐటి ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రుషికొండ ఐటి సెజ్ హిల్ నెంబర్ 2లోగల పల్సస్ హెల్త్ టెక్ సంస్థలో పనిచేస్తున్న ఐటి ఉద్యోగులకు బకాయి పడ్డ నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో నైపుణ్యంగల స్టాఫ్‌వేర్ ఉద్యోగస్తులతో అతి తక్కువ జీతాలతో పనిచేయించుకుంటూ, ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కాన్ఫరెన్స్, జనరల్ క్యాటగిరీ ఉద్యోగస్తుల నుంచి ప్రతి నెలా జీతం నుండి 10 నుండి 15 శాతం అన్యాయంగా కోత విధిస్తున్నారన్నారు. పల్సస్ యాజమాన్యం జాబ్ మేళా, క్యాంపస్ సెలక్షన్స్ పేరుతో ఐటి విద్యార్థులను ఎంపిక చేసి వారికి జీతాలు ఇవ్వకుండా మోసం చేయడం తగదన్నారు. అలాగే వారికి పిఎఫ్ కింద యాజమాన్యం వాటా చెల్లించటం లేదన్నారు. ప్రభుత్వం వద్ద నుండి అనేక రాయితీలు పొందుతున్న పల్సస్ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా వారితో వెట్టిచాకిరీ చేయించుకోవడం దుర్మార్గమన్నారు. ఐటి ఉద్యోగుల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు.

నేడు ఆర్‌కె బీచ్‌లో శివరాత్రి ఉత్సవాలు

ఏర్పాట్లును పరిశీలిస్తున్న సుబ్బిరామిరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్‌కె బీచ్ వద్ద ఎప్పటిలాగే మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉత్సవాలు జరుగనున్నాయి. ఈసారి మహా కుంభాభిషేకాన్ని వైభవంగా జరుపనున్నట్లు డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి తెలిపారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆర్కే బీచ్ వద్ద 40వ మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా నుండి తీసుకొచ్చిన జలాలతో అభిషేకం ఉంటుందన్నారు. సాగరతీరాన బుధవారం ఉదయం 9.30 గంటల నుండి కోటీ 8 లక్షల శివలింగాలకు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి వారి కల్యాణం, 4.30 గంటలకు హోమం ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం, అవధాని మాడుగుల నాగఫణి శర్మ హాజరుకానున్నట్లు తెలిపారు.

జగన్ వ్యవహారం సరికాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పుతో జగన్‌కు దిమ్మతిరిగిందని, ప్రజా తీర్పును స్వాగతించకుండా జగన్ వ్యవరిస్తున్న తీరు సరికాదని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను గాలికొదిలేసి ప్రతిపక్ష హోదా కోసం జగన్ ఆరాటపడుతున్నారన్నారు. 11 సీట్లు ఉన్న జగన్‌కు ప్రతిపక్ష హోదా అడిగే నైతిక హక్కు లేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలను భ్రష్టు పట్టించిందన్నారు. విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉపాధ్యాయుల పట్ల వైసిపి ప్రభుత్వం దారుణంగా వ్యవహరించిందని చెప్పారు. మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను పెట్టిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందన్నారు.

ఆగిన పెద్దేరు, రైవాడ జలాశయ పనులు

(మొదటి పేజీ తరువాయి..)

సాగునీటి వనరులు లేకపోవడంతో ఉన్నపాటి వనరులను అభివృద్ధి చేయడానికి చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించడంలేదు. ఆయకట్టు స్థిరీకరణకు కావాల్సిన నిధులు, పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు సరిపడా నిధులు విడుదల చేయడంలేదు. రైవాడ డ్యామ్ పునరుద్ధరణ, అభివృద్ధి ప్రాజెక్టు దశ - 2 పథకం కింద రూ.336 కోట్ల అంచనాలను రాష్ట్ర ప్రాజెక్టు మానిటరింగ్ విభాగం తయారుచేసి సిడబ్ల్యుసికి సమర్పించింది. ఈ పనుల ప్రాంత స్థలాన్ని సిడబ్ల్యుసి కన్సల్టెంట్ టీమ్ గతేడాది నవంబరు 27న పరిశీలించి సిడబ్ల్యుసికి నివేదించింది. ఇంకా పనుల మంజూరు అనుమతులు సిడబ్ల్యుసి నుంచి రావాల్సివుంది. మాడుగుల మండలం తాటిపర్తి వద్ద ఎన్‌టిఆర్ జలాశయ బ్యాలెన్స్ పనులకు రూ.21,75 కోట్లతో 2022 సెప్టెంబరు 1న అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే, నిర్మాణ పనుల వ్యయం పెరగడంతో ప్రభుత్వ సూచన ప్రకారం 2024-25 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఇంకోసారి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాల్సివుంది. మాడుగుల మండలం శంకరం వద్ద ఉరకగెడ్డ జలాశయ పనులకు 2023 డిసెంబరు 21న రూ.14.50 కోట్లతో పంపిన ప్రతిపాదనలపై నిధులు విడుదల చేయకపోవడంతో పాత రేట్లను పునస్సమీక్షించి మరోసారి ప్రతిపాదనలు పంపాల్సివుంది.

IN THE HON'BLE COURT OF THE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (MOBILE) FOR TRAIL OF CASES UNDER PCR ACT CUM II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
E. P. 119 of 2022
O. S. 588 of 2018

Between:
B. Venkata Rama Krishna . . .D.Hr/Plaintiff
And:
T. Venkata Reddy ... J.Dr/Defendant
To:
Tatiparthi Venkata Reddy,
S/o. Late Anji Reddy,
aged 71 years, R/o. D.No. 16-51,
Srinivasanagar, Madhurawada,
Visakhapatnam

Please take notice in the proceedings under Order 21 Rule 34 of CPC in the above EP stands posted on 07-03 2025 for your notice by way of substituted service of summons as ordered by the Honourable court. Therefore you are informed by means of this notice that you have to appear in the above matter before the Honourable court at 10:30 AM either in person or through an advocate to answer the claims in the above EP, failing which the matter will be decided in your absence.

B. VENKATA RAO
Advocate for D.Hr
Cell: 9989359666
Vizianagaram,
Date: 25-02-2025

IN THE HONOURABLE COURT OF THE VIth ADDITIONAL DISTRICT SESSIONS JUDGE MAHILA COURT AT VISAKHAPATNAM
M.V.O.P. 900 / 2022

Between:
Gavva Aruna Kumari ...Petitioner
And:
Nammi Munindra and others ...Respondents

NOTICE

To,
RESPONDENT No.2
Gorrela Satyavathi, W/o.Jagga Rao, Hindu, aged not known but major, owner of Auto Bearing Registration No. AP 31 TF 6952,
D.No. 31-51-50, Old Street,
Golla Jaggarajupeta, Gajuwaka Mandal, Visakhapatnam.

Please take notice that the above named petitioner filed the above M.V.O.P. against you for claiming compensaton and the matter coming for your appearance and stands posted to **Dt. 18-3-2025** on that day your personally or through advocate attend before the Honourable Court at 10-30 A.M. failing which the Honourable Court is decided under the court of law.

T.SRINIVASA RAO
T.SIVA PRASAD RAO
Advocates, Visakhapatnam.
Cell : 9440402246

ప్రకటన

మా క్లయింటు అయిన అనకాపల్లి జిల్లా, యస్.రాయవరం మండలం, చిన గుమ్ములూరు గ్రామం కాపురస్తులు **రంగాల రాము గారి కుమారుడు రంగాల సత్తిబాబు గారు** నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింటు అయిన రంగాల రాము గారు యానం గ్రామ కాపురస్తులు గ్రంధి వీరభద్రరావు గారి భార్య గ్రంధి క్రాంతి గారి వద్ద కొనుగోలు చేయదలచి క్రయ అగ్రిమెంటు చేసుకొనియున్నారు. అయితే సదరు స్థిరాస్తికి చెందినటువంటి లింకు డాక్యుమెంట్‌లలో 30-12-1991 నాటి క్రయ దస్తావేజు అయిన 1689/1991, చాలాకాలం క్రితం నుండి కనిపించుటలేదు అని సదరు స్థిరాస్తి యజమాని గ్రంధి క్రాంతి గారు మా క్లయింటును నమ్మించి ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని అమ్మజూపుతున్నారు. సదరు విషయమై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని, క్లయిములు గాని ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన వారం రోజుల్లో ఈక్రింది అడ్రసుకు లిఖితపూర్వకముగా తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు: పూర్వం విశాఖపట్నం జిల్లా, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, నక్కపల్లి సబ్.డి. పాయకరావుపేట మండలం, పాయకరావుపేట పంచాయతి, గ్రామం తాలూకు పట్టా నెం. 24, సర్వే నెం. 73రు, దాఖలా య. 4.14 ట్లులో హరిజనపేట ఏరియా, 15వ వార్డు, వీవర్స్ కాలనీ వద్ద గల ప్లాట్ నెం. 71రు, డోరు నెం. 33-67రు, అసెస్‌మెంట్ నెం. 2865రు, అందలి 150 చ॥గ॥ లేక 125.41 చ॥మీ॥ గల నివేశన స్థలం మరియు అందలి ఆర్.సి.సి. రూఫ్ డాబా ఇల్లుకు కొలతలు, హద్దులు.

తూర్పు: 45.0 అ॥ - సకల రాంబాబు, గణేష్ గార్ల ప్లాట్ నెం. 70 రు స్థలం. **పడమర:** 45.0 అ॥ - కొండపల్లి సత్యవతి గారి ప్లాట్ నెం. 69రు స్థలం. **ఉత్తరం:** 30.0 అ॥ - దుడ్డు వెంకట సత్యవతి గారి ప్లాట్ నెం. 72రు స్థలం. **దక్షిణం:** 30.0 అ॥ - రోడ్డు.

సదరు హద్దుల మధ్యస్తమైన చ॥గ॥ 150 లు స్థలము, అందలి ఆర్.సి.సి. బిల్డింగు యావత్తు యీజిమెంటు హక్కులు, అందలి సర్వం సహా.

నున్న పవన్‌కుమార్, నున్న వీరేంద్రకుమార్
అడ్వకేట్స్, డోరు నెం.10-154
రమణయ్యపేట, కాకినాడ
సెల్: 9553315556
కాకినాడ
26-2-2025

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో మంగళవారం 'ఇన్‌స్పైర్ అండ్ ఇన్నోవేట్ ది గ్రేయమింగ్ ఫ్యూచర్ ఆఫ్ ఫార్మసీ' అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ము త్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నేడున్న పరిస్థితిలో ఐటి రంగంలో కంటే ఫార్మసీ రంగంలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని వివరించారు. ఇతర దేశాల్లో వైద్యునితో సమానంగానే ఫార్మాసిస్టుకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కోవిడ్-19లో ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారిలో ఫార్మాసిస్టులే ఎక్కువ మంది ఉన్నారని గుర్తు చేశారు. సీయర్ ఫార్మా ఫోరం అధ్యక్షులు డాక్టర్ టివి.నారాయణ మాట్లాడుతూ, 21వ శతాబ్దం ఫార్మసీ రంగానిదే అని స్పష్టం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల మాజీ ప్రిన్సిపల్, ఐపిఎ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ పి.రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో పరిశోధన, అభివృద్ధిలో పాత్రను వివరించారు. మెడికోవర్ హాస్పిటల్స్ ఉపాధ్యక్షులు డాక్టర్ నిమ్మగడ్డ పద్మజ మాట్లాడుతూ,

సదస్సులో మాట్లాడుతున్న అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆరోగ్య సంరక్షణ రంగంలో ఫార్మాసిస్టుల అంతర్భాగమైన పాత్రను వివరించారు. రోగి పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలు, ఔషధ భద్రత, ఆరోగ్య సంరక్షణలో వారి పాత్రను, ప్రభావాన్ని విపులంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియం మాట్లాడుతూ, ఫార్మాస్యూటికల్ రంగంలో నూతన ఆవిష్కరణలను వివరించారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ, ఫార్మసీ రంగంలో పరిశోధన, అభివృద్ధిలో పాల్గొని భవిష్యత్తును సొంతం చేసుకోవాలని కోరారు. పరిశోధనలో ప్రేరణను, తాజా అభివృద్ధిపై అవగాహన, భవిష్యత్తు అవకాశాలను అన్వేషించేందుకు ఈ సదస్సు గొప్ప వేదికగా ఉపయోగపడిందని సదస్సుకు హాజరైన విద్యార్థులు అభిప్రాయ పడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబివి.రాజు, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం పాలయ్యాడు. మరొకరు గాయపడినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ ఐ సన్ని బాబు తెలిపారు. కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం, దుర్గాడ గ్రామానికి చెందిన బి శ్యాంప్రసాద్ (28), ఎస్‌సాయిబాబు బైక్ పై సోమవారం రాత్రి నక్కపల్లి వైపు వస్తుండగా వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బి.శ్యాంప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిబాబు గాయపడినట్లు వెల్లడించారు. మృతిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తొమ్మిది మందిపై కేసు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని సిహెచ్.నాగాపురం శివారు వల్లాపూరం గ్రామంలో సోమవారం కమ్యూనిటీ హాల్ కొరకు కేటాయించిన స్థలాన్ని వల్లా చిన్న అనే వ్యక్తి ఆక్రమించుకుని నివాసం ఉంటున్నారని కారణంగా గ్రామస్తులు ఆ పాకను తొలగించారు. దీంతో వల్లా చిన్న ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని కెడిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఇరువర్గాలకు సంబంధించి 20 మందిపై బైండోవర్ చేశామని, వీరిని తహశీల్దార్ కోర్టులో ప్రవేశపెడతామన్నారు.

మొబైల్ రిపేర్ కోర్సుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ విద్యా కేంద్రంలో మొబైల్ రిపేర్, మెయింటెనెన్సు కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు అందించే ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు స్త్రీ, పురుషులు ఎవరైనా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వయసు పరిమితి లేదని పేర్కొన్నారు. దరఖాస్తులను మార్చి 10వ తేదీలోపు దయాల్‌బాగ్ విద్యాకేంద్రంలో అందించాలని కోరారు. మరిన్ని వివరాలకు 99633 40611 నెంబరును సంప్రదించాలని సూచించారు.

గీతంలో లక్ష్మీపార్థసారథి భరతనాట్యం

ప్రజాశక్తి -మధురవాడ : యువతలో భారతదేశ శాస్త్రీయ సంగీతం, నృత్య కళలను ప్రోత్సహించడానికి ఏర్పాటైన స్పిక్‌మేకే (సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ యమాంగెస్ట్ యూత్) ఆధ్వర్యాన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రముఖ భరతనాట్య కళాకారిణి లక్ష్మీపార్థసారథి ఆత్రేయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భరతనాట్యం విశిష్టతను తెలియజేస్తూ ప్రదర్శన ఇచ్చారు. భక్త కన్నప్ప, భక్తమార్కండేయ శివభక్తిని, అంతిమంగా వారి భక్తికి మెచ్చి శివుడు ప్రత్యక్షమై రక్షించుకున్న కథను లక్ష్మీపార్థసారథి ఆత్రేయ తన అభినయంతో నృత్యం ద్వారా ఆకట్టుకున్నారు. ప్రముఖ కళాకారులు నృత్యానికి గాత్ర, వాయిద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని గీతం విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ బాలాకుమార్, గీతం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ అముక్తమాల్యద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర సంగీత నాటక అకాడమి నుంచి 2013లో బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాన్ని అందుకున్న లక్ష్మీపార్థసారథి యువతకు స్ఫూర్తి అని కొనియాడారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని చిట్టివలస జెడ్‌పి బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రోజామణి విద్యార్థినులకు సూచించారు. పాఠశాలలో మంగళవారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థి భవిష్యత్తుకు తొలి అడుగు టెన్త్ అని నొక్కి చెప్పారు. ఇందులో మంచి ఫలితాలు వస్తే ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పరీక్షల నేపథ్యంలో ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పివి.లక్ష్మి, రామలక్ష్మి, భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే అభివృద్ధి

పద్మనాభం : విద్యార్థి దశలో చదువుకుంటేనే భవిష్యత్తులో అభివృద్ధి చెందుతారని ఆర్‌వి.పురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు అన్నారు. మండలంలోని ఆర్‌వి.పురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఎ.గంగరాజు, ఎం.అప్పారావు, పి.అప్పలనాయుడు, కె.రమణ, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ స్థలంలో మంటలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి నగర శివారు ప్రాంతమైన రామకృష్ణాపురం కాలనీ వెనుకభాగంలో రైల్వేజోన్‌కు కేటాయించిన స్థలంలో మంగళవారం ఉదయం మంటలు రేగాయి. ఆ స్థలంలో అప్పటికే చెత్త పెద్ద ఎత్తున డంపింగ్ చేసి ఉంది. అక్కడ మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో సమీపంలోని కాలనీ వాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఎండిన తుప్పలకు ఎవరో నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి ఉండవచ్చని పలువురు అనుమానిస్తున్నారు.

ఉద్యోగాలకు 25 మంది ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక శ్రీ బాసర డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్ మేళాలో 25 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.సురేష్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, డీన్ భాస్కరరావు, ఎఒ కేశవ్ తెలిపారు. విజార్ ఎడ్యుకేషన్ అండ్ ఐటి సొల్యూషన్స్ సహకారంతో నిర్వహించిన జాబ్ మేళాలో చోళ, డెక్కన్, పేటిఎం, సుజుకి, వరుణ్, ఎకో హుండ, శ్రీరామ్ చిట్స్ తదితర సంస్థలు ఎంపిక నిర్వహించాయి. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను శ్రీ బాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ అభినందించారు.

అన్నదానం

ప్రజాశక్తి -గాజువాక : శ్రీ కనక దుర్గాదేవి ఆలయం 21వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శివపార్వతుల కల్యాణం పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్లు మహ్మద్ ఇమాన్, ఉరుకుటి చందు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల మూత

ప్రజాశక్తి- పద్మనాభం : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పద్మనాభం మండలంలో రెండు రోజులు పాటు ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేస్తున్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం షాపులు సెలవు ప్రకటించారు. ఈ సందర్భంగా మద్ది గ్రామంలోని షాపులకు భీమిలి ఎక్సైజ్ కానిస్టేబుళ్లు షీలు వేశారు.

నేరాలు ఘోరాలు

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : ఆటోలో తరలిస్తున్న 26 కిలోల గంజాయిని పోలీసులు మంగళవారం భీమిలి క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్నారు. భీమిలి క్రాస్ రోడ్ వద్ద టాస్క్‌ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ భరత్, ఆనందపురం సబ్ ఇన్‌స్పెక్టర్ శివ, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆటోను పరిశీలించగా 26 కిలోల గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి 26 కిలోల గంజాయి ప్యాకెట్లు, ఎపి 39 యు 0076 ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్ర-ఒడిశా బోర్డర్ పుల్లామా, ధారకొండ నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన శోభా భీమన్న (28) ప్రస్తుతం మారికవలసలో నివాసముంటున్నాడు. ఈయనపై ఏ1గా కేసు నమోదు చేశారు. ఏ 2గా హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన శ్రావణ్‌రామ్ (60), ఏ 3గా అల్లూరి జిల్లాకే గుజ్జుల రాంబాబు (33)పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని ఆనందపురం సిఐ చింత వాసునాయుడు తెలిపారు.

పెందుర్తి : రహస్యంగా లిక్విడ్ గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. కొర్ర లక్ష్మి, శోభ కృష్ణ సుమారు మూడున్నర లీటర్ల గంజాయిని తరలిస్తుండగా జివిఎంసి 94వ వార్డు పరిధి అప్పన్నపాలెం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏజెన్సీ నుండి నగరానికి తరలిస్తున్నట్లుగా గుర్తించామని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సిఐ సతీష్ కుమార్ తెలిపారు.

నక్కపల్లి :మండలంలోని సారిపల్లిపాలెం హైవే జంక్షన్ వద్ద గంజాయిని స్వాధీనం తీసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ ఐ సన్ని బాబు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం సారిపల్లిపాలెం హైవే జంక్షన్ వద్ద నిఘా పెట్టగా తమిళనాడు రాష్ట్రం, ఈరోడ్‌కు చెందిన రాజేంద్రన్, సెల్వం, తిరువురుకు చెందిన తమిళ్ అరసు ఒడిశా నుంచి లగేజ్ బ్యాగులలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 24 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం బుచ్చయ్యపేట గ్రామ శివారున గుళ్లాటలు, కోడిపందాలు ఆడుతున్న ఐదుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... తీర్థం సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా, ఇద్దరు వ్యక్తులు పట్టుపడ్డారు. వారి నుండి రెండు కోళ్లు, రూ.1420 నగదు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేశారు. అలాగే గుళ్లాటలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి రూ.3020 నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు చోరీ కేసుల ఛేదన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల జరిగిన రెండు చోరీ కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసుల వివరాలను మంగళవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైమ్ ఎడిసిపి మోహన్‌రావు వెల్లడించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పెదవాల్తేరు సమీపంలో ఈ నెల 22న మైలపల్లి చంద్రరావుపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ఆయన వద్దనున్న సెల్‌ఫోన్, నగదును దొంగిలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు విచారణ జరిపి చినగదిలి దీన్‌దయాల్ నగర్‌కు చెందిన తీడ మోనేష్ బాబు సహా మరో ఇద్దరు జువైనల్ నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 వేల నగదు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిని రిమాండ్‌కు, మైనర్ నిందితులను జువైనల్ హోమ్‌కు తరలించారు.

రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 16న చోరీ జరిగింది. బాధితురాలు మజ్జూరు శకుంతలా లక్ష్మీ లావణ్య అల్లిపురం సమీపంలోని కెప్టెన్ రామారావు జంక్షన్ వద్ద ఉన్న తన తల్లి ఇంటికి వెళ్లింది. అనంతరం ఓ శుభ కార్యానికి హాజరైంది. అదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి రూ.1.70 లక్షల నగదు, పావు తులం బంగారం, చెవి దిద్దులు అపహరించారు. ఈ కేసులో షేక్ ఖాదర్ బాషాను మర్రిపాలెం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి రూ.39 వేల నగదు, బంగారు చెవి దిద్దులను స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో ఎసిపి లక్ష్మణమూర్తి, క్రైమ్ సిఐ ఎర్రం నాయుడు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సమావేశంలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు

ముగిసిన ఎంఎస్ఎంఇ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో ఏర్పాటుచేసిన ఎమ్ఎస్ఎమ్ఇ ఎగ్జిబిషన్ మంగళవారం సాయంత్రం ముగిసింది. ఎంఎస్ఎంఇకి మార్కెటింగ్ మద్దతు అందించడం ద్వారా వ్యాపార అవకాశాలను పెంచడం, విక్రేతల విస్తరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా ఎగ్జిబిషన్ కొనసాగింది. ఈ ఎగ్జిబిషన్‌లో మొత్తం 32 స్టాల్స్ ఏర్పాటుచేశారు. ఆరు సిపిఎస్ఇ స్టాల్స్, నాలుగు బ్యాంకులకు సంబంధించిన స్టాల్స్ 22 చిన్న మధ్య తరగతి పరిశ్రమల స్టాల్స్ ఏర్పాటుచేసి, వారి ఉత్పత్తులను ప్రదర్శించారు. హెచ్‌పిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.తిరుమురుగన్, ఎన్ఆర్‌డిసి సీనియర్ మేనేజర్ భవ్యా మంజీరా, పిఐడబ్ల్యూఏ అధ్యక్షులు సత్యనారాయణ, యూకో బ్యాంక్ చీఫ్ మేనేజర్ డివి.రావు, విశాఖ స్టీల్‌ప్లాంట్ డిజిఎం రేవతి, హెచ్‌పిసిఎల్ జనరల్ మేనేజర్ సుధాకర్, ఎంఎస్ఎంఇ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న డాక్టర్ అవినాష్, పాల్గొన్న ఐలా పాలకవర్గం

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి -గాజువాక : ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ సూచించారు. ఐలా, వాసవ ఆధ్వర్యాన రైజ్ హాస్పిటల్ సహాయంతో గాజువాక ఆటోనగర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణంలో మార్పులు, వ్యక్తి జీవనశైలి మార్పులు కారణంగా ప్రజలు అనేక రోగాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 300 మంది వివిధ పరిశ్రమ యజమానులు, సిబ్బంది పాల్గొని వివిధ రకాల రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావు, శేషగిరిరావు, కొల్లి ఈశ్వరరావు, రైజ్ హాస్పిటల్ ఎమ్‌డి వేగి అవినాష్, వాసవ, ఐలా సభ్యులు పాల్గొన్నారు.

పైడిమాంబ జాతర కరపత్రం విడుదల

ప్రజాశక్తి -గాజువాక : నడుపూరులోని శ్రీ పైడిమాంబ అమ్మవారి జాతర నేపథ్యంలో పండగకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పండగ నిర్వాహకులు మంత్రి శంకర్‌నారాయణ మాట్లాడుతూ, మార్చి 11 నుండి 18వ తేదీ వరకు పండగ జరగనున్నట్లు తెలిపారు. రోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, అఖిల్ నాయుడు, మంత్రి రాజశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడివాడను కలిసిన చిత్రాడ

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్‌ను పార్టీ బిసి.సెల్ అధ్యక్షులు చిత్రాడ వెంకటరమణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు అధ్యక్షులు బొడ్డ గోవిందు, ఎల్‌పిసి.నాయుడు పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

వేతనాలపై పోరాటానికి సిద్ధం కావాలి

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించని యాజమాన్య వైఖరిపై పోరాటానికి సిద్ధం కావాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వేతనాలను సకాలంలో చెల్లించటం లేదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్)కు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం లేబర్ ఆఫీసులో చర్చలు జరిపారు. ఈ చర్చలకు యాజమాన్య ప్రతినిధులు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు హాజరయ్యారు. చర్చల అనంతరం అయోధ్యరామ్ మాట్లాడుతూ, యాజమాన్య ప్రతినిధులు కుంటి సాకులతో వేతనాలపై ప్రతిష్టంభనను మరింత జటిలం చేసేలా వాదనలను వినిపించారని తెలిపారు. స్టీల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తాము వివరించామని చెప్పారు. తమ వాదనలు విన్న తర్వాత లేబర్ కమిషనర్ (సెంట్రల్) స్టీల్ యాజమాన్యానికి సమస్య పరిష్కారం కోసం మౌఖిక ఆదేశాలు ఇచ్చారని వివరించారు. డిసెంబర్ నుండి నేటి వరకు స్టీల్ అమ్మకాల ద్వారా రూ.6,200 కోట్లను యాజమాన్యం ఆర్జించిందని తెలిపారు. స్టీల్ యాజమాన్యం వీటిని పరిగణలోకి తీసుకుని విధంగా తమ వైఖరిని ప్రదర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగార పరిరక్షణకు శాంతియుత ఆందోళనలను చేస్తూ, చర్చలతో సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేశామని తెలిపారు. కానీ యాజమాన్యం దీనిని అసమర్థతగా పరిగణించి కార్మిక పోరాటాలను తక్కువ అంచనా వేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే కాంట్రాక్టు కార్మికులు యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా మార్చి 7వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నారని గుర్తు చేశారు. స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించే విషయంలో కలిసి వచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళనలు ఉధృతం చేస్తామని, ఇదే సమయంలో న్యాయపోరాటానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, స్టీల్ యాజమాన్య ప్రతినిధులు ఫైనాన్స్ డిజిఎం ఎస్.రాంప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ వై.హెచ్.శంకర్ పాల్గొన్నారు.

లేబర్ కమిషనర్‌తో చర్చలో పాల్గొన్న అయోధ్యరామ్, రామస్వామి, యాజమాన్య ప్రతినిధులు

అదనపు లోడును క్రమబద్ధీకరించుకుంటే రాయితీ

ప్రజాశక్తి-సీతమ్మధార : అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకొనే గృహ విద్యుత్ వినియోగదారులకు డెవలప్‌మెంట్ ఛార్జీల చెల్లింపులో రాయితీని అందించనున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలకు అనుగుణంగా అదనపు లోడును క్రమబద్ధీకరించుకొనే గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీని మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ఇవ్వనున్నామని తెలిపారు. సంస్థ పరిధిలోని 11 జిల్లాలలో ఉన్న గృహ విద్యుత్ వినియోగదారులలో కొంతమంది తాము ఏపీఈపీడీసీఎల్‌తో కుదుర్చుకున్న ఒప్పందపు లోడుకన్న ఎక్కువ లోడ్ కలిగిన విద్యుత్ పరికరాలను (ఎయిర్ కండిషనర్లు, వాటర్ హీటర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు) గృహాలలో వినియోగించటం వలన ఊహించని విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై అధికభారం పడుతోందని, విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, లో వోల్టేజీ, ఫ్యూజ్ పోవటము, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోవటం తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ లోపాలను అధిగమించేందుకు గృహ విద్యుత్ వినియోగదారులకు స్వచ్ఛందంగా అదనపు లోడును క్రమబద్ధీకరించుకోనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ పొందే సమయంలో తీసుకున్న లోడు కంటే అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలనుకుంటే ప్రస్తుతం ఒక కిలోవాట్‌కు రూ.2200 (డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200) చెల్లించాల్సి ఉంటుందని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవారు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌తో కలిపి రూ.1200 చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. వినియోగదారులు ఎలక్ట్రిసిటీ రెవిన్యూ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల ద్వారా, ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ www.apeasternpower.com లో దరఖాస్తు చేసుకుని తగిన చార్జీలను చెల్లించి లోడును క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 1912 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సాఫ్ట్‌వేర్ మార్కెట్ వృద్ధి

ప్రజాశక్తి-సీతమ్మధార : డిజిటల్ పరివర్తనకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా భారతీయ సాఫ్ట్‌వేర్ మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోందని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ పేర్కొన్నారు. ద్వారకానగర్ క్యాంపస్‌లో మంగళవారం క్యాంపస్ డ్రైవ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నంలోని భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐటీ సెజ్‌లోని మరో క్యాంపస్ మార్చి 1వ తేదీన ద్వారకానగర్‌లోని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో క్యాంపస్ డ్రైవర్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పాత్రలో దాదాపు 50 నియామకాలు ఉన్నాయని తెలిపారు. '2023-24 విద్యా సంవత్సరం నుండి 60 శాతం మార్కులతో బి.టెక్ (సిఎస్ఇ) చేసిన విద్యార్థులు, కంప్యూటర్ సైన్స్, సి, పైథాన్, నెట్, ఫ్రేమ్‌వర్క్, హెచ్‌టిఎంఎల్, సిఎస్ఎస్, జావాస్క్రిప్ట్‌లలో మంచి నైపుణ్యం కలిగిన ఇతర గ్రాడ్యుయేట్లు ఈ క్యాంపస్ డ్రైవ్‌కు అర్హులని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ జి.సాగర్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ద్వారకానగర్‌లోని క్యాంపస్‌కు నేరుగా మార్చి 1వ తేదీన రావచ్చని తెలిపారు. వారి రెజ్యూమ్‌లను hr@millenniumsoftsol.com కు పంపాలన్నారు. డ్రైవ్‌కు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.millenniumsoftsol.com, లేదా 9248753098 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ కె.దివ్య తదితరులు పాల్గొన్నారు.

టెండర్‌కు ఎవరొచ్చినా అడ్డుకుంటాం

దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణకు టెండర్ పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుంటామని పోర్టు సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ హెచ్చరించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 147వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని తెలిపారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం అన్యాయమన్నారు. విశాఖ అభివృద్ధిలో పోర్టు కీలకమైనదన్నారు. ఏటా మున్సిపాలిటీకి రూ.65 కోట్ల పన్నులు కడుతున్న పోర్టును ప్రైవేట్ వారికి ధారాదాత్తం చేస్తే అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. టెండర్లను వాయిదాలు వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రైవేటీకరణపై తీసుకున్న నిర్ణయం అన్యాయమన్నారు. ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.సత్యనారాయణ, డి.ఈశ్వరరావు, నాయుడు, బి.జగన్, రాజగోపాల్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అధికారిక దత్తతనే ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి- కరాస: సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వం రూపొందించిన కారా చట్టం నిబంధనలననుసరించి అధికారిక దత్తతలను మాత్రమే ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. మర్రిపాలెంలోని శిశుగృహలో మంగళవారం కారా చట్టాన్ని అనుసరించి మూడేళ్ల ఆడపిల్లను తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన డి.మోహన్‌రాజ్, ఎస్.సత్య దంపతులకు అధికారిక అప్పగింత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, అధికారిక దత్తత వల్ల భవిష్యత్తు సురక్షిత మార్గాలు, అనధికార దత్తతలతో అనర్థాలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. విశాఖ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఎంఆర్ఎల్.రాధ మాట్లాడుతూ, అధికారిక దత్తత తీసుకున్న తల్లిదండ్రులు సొంత బిడ్డలు కంటే ఎక్కువ ఆదరాభిమానాలతో పెంచి, వారిని అన్ని విధాలా అభివృద్ధి పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణకుమారి, పిఒఎస్‌పిసి మమత, శిశుగృహ మేనేజర్ సుజాత, పి.రామలక్ష్మి, మండ రజని, విజయ లక్ష్మి, సూర్యనారాయణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ కొండపై మంటలు

ప్రజాశక్తి -గాజువాక : కొత్తగాజువాకలోని కృష్ణానగర్ కొండపై మంగళవారం రాత్రి మంటలు వ్యాపించాయి. రాత్రి కావడం, ఎక్కువగా మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏటా వేసవి ప్రారంభంలో మంటలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి

కోరెడ్ల విజయ గౌరి విస్తృత ప్రచారం

పరవాడ జెడ్‌పి బాలికోన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులను కలిసిన విజయగౌరి

ప్రజాశక్తి-పరవాడ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులతో కలిసి విజయగౌరి పరవాడ జిల్లా పరిషత్తు బాలురు, బాలికల హైస్కూళ్లను సందర్శించి ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు శాసన మండలి ఉద్దేశాన్ని పూర్తిగా నీరుగార్చే విధంగా రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలను మార్చివేశారని తెలిపారు. ఇలాంటి సందర్భంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో గొంతెత్తి ప్రశ్నిస్తూ, బయట జరిగే ఉద్యమాలకు అండగా నిలిచేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. శాసనమండలి ఉద్దేశాన్ని నెరవేర్చి, దాని హోదాను, ఉన్నతిని కాపాడే నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడే పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉత్తరాంధ్ర నుంచి ఒక మహిళను శాసన మండలికి పంపించవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ నాయకులు ప్రకాష్, రాము, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం, మోసయ్యపేట జిల్లా పరిషత్తు హైస్కూళ్లలో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మంగళవారం పిడిఎఫ్, యుటిఎఫ్ నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ గౌరి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఓటు ఎవరికి వేయాలి? ఎవరికి వేయకూడదు? ఎందుకు వేయాలి? ఎందుకు వేయకూడదు? అనే దానిపై ప్రతి చోట చర్చ జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు అంటేనే ప్రశ్నించేవారని, ఇలాంటి సందర్భంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల తరుపున నిరంతరం గొంతెత్తే మాట్లాడే పిడిఎఫ్ అభ్యర్థిగా తనకు మొదటి ప్రాధ్యానత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎఫ్ నాయకులు వెంకట అప్పారావు, ప్రకాష్, రాము, పార్వతి, యుటిఎఫ్ నాయకులు గొంది చిన్నబ్బాయి, ప్రజా సంఘాల నాయకులు కర్రి అప్పారావు, ఆర్.రాము, కె.సోమునాయుడు, బ్రహ్మాజీ, కె.రామసదాశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగరపువలస కెజిబివిలో ప్రచారం చేస్తున్న మహిళా టీచర్లు

యుటిఎఫ్ మహిళల ప్రచారం

తగరపువలస, పద్మనాభం, ఆనందపురం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విజయాన్ని కాంక్షిస్తూ యుటిఎఫ్ జిల్లా మహిళా విభాగం ప్రతినిధులు మంగళవారం ఆనందపురం, పద్మనాభం మండలాల్లో, తగరపువలసలో ప్రచారం చేశారు. తగరపువలస, పద్మనాభం కెజిబివిల్లో, ఆనందపురం మండలం తర్లువాడ, ఆనందపురం హైస్కూల్, కెజిబివిలో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి తొలి ప్రాధాన్యత ఓటును విజయగౌరికి వేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ఎస్.నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, జిల్లా సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, జిల్లా కార్యదర్శి వి.రామలక్ష్మి, విజయకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మోసయ్యపేట జెడ్‌పి హైస్కూల్‌లో ప్రచారంలో పాల్గొన్న విజయగౌరి

ఆనందపురంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్థిక సహాయం అందిస్తున్న జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన గవ్వ బాబురావు కుటుంబానికి పోలీసులు ఆర్థిక సాయం అందించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు వేతనం, ఇతర ఆర్థిక సహాయం కలిపి రూ.4,12,140 మొత్తాన్ని చెక్ రూపంలో మృతుని భార్య గవ్వ వీరలక్ష్మికి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి తుహిన్ సిన్హా చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డులలో విధి నిర్వహణలో మరణించిన లేదా ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో పనిచేస్తున్న హెూంగార్డులు స్వచ్ఛందంగా ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి కళ్లద్దాలు పెడుతున్న డాక్టర్ మనీషా

గురుకుల విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికలు గురుకుల పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయబాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏ.మనీషా విద్యార్థినులకు ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ పాఠశాల బాలికలకు గతంలో కంటి పరీక్షలు జరిపి, దృష్టి ఉన్న విద్యార్థిలను గుర్తించారు. వారికి మంగళవారం కళ్ళజోడులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆఫ్తాలమిక్ ఆఫీసర్ సిహెచ్.ప్రసాద్ రాజు, వైద్య సిబ్బంది ఎంఎస్‌వి.ప్రసాద్, యు.ఆనందరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.గ్రేస్, కేఎస్‌ఆర్‌కెజి.నరసింహారావు, గురుకుల హెల్త్ అంబాస్సడర్ బి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే పిడిఎఫ్ లక్ష్యం

- విజయగౌరికి అవకాశమివ్వండి
- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ విజ్ఞప్తి చేశారు. ద్వారకానగర్‌లోని శ్రీ చైతన్య కాలేజీలో ఆయన మంగళవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధే పిడిఎఫ్ అజెండా అని, ప్రజల పక్షాన నిరంతరం నిలబడటం మాత్రమే లక్ష్యమని తెలిపారు. తటస్థంగా ఉంటూ 18 ఏళ్ల నుంచి 14 మంది పిడిఎఫ్ తరఫున శాసన మండలి సభ్యులుగా ప్రజాగళాన్ని వినిపించిన విషయాన్ని గుర్తుచేశారు. విజయ గౌరి ఈ ఎన్నికలలో గెలిస్తే ఇదే పద్ధతిని పాటిస్తారన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు, విద్యావంతులు గుర్తించాలని కోరారు. విజయ గౌరి 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారని, ఇంకా ఆరేళ్లపాటు ఆమె ఉద్యోగంలో కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికలలో ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల అనేక సమస్యలపై ఆమె ప్రత్యక్షంగా పాల్గొని అరెస్టు అయ్యారన్నారు. ఉద్యమాల నుంచి వచ్చిన ఆమెను గెలిపించి శాసన మండలికి పంపించాలని కోరారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ



కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలి

ఎపిటిఎఫ్ కార్యకర్త ముత్యాల నాయుడు

ప్రజాశక్తి- పెందుర్తి, విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ బలపరిచిన యుటిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఎపిటిఎఫ్ సీనియర్ కార్యకర్త ముత్యాలనాయుడు విజ్ఞప్తి చేశారు. పెందుర్తి మండలంలోని గవర్నమెంట్ హైస్కూలు పాత పెందుర్తి జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్, సరిపల్లి, గోరపల్లి, రాంపురం, చింతలగ్రహారం, వేపగుంట, జుత్తాడ, శాంతినగర్ హైస్కూళ్లలో పలువురు ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ. కోరెడ్ల విజయగౌరికి మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ రంగు పులమటం భావ్యంకాదన్నారు. దాదాపు 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తాను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయుల పక్షాన పోటీచేసే అభ్యర్థులకు మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల మద్దతుతో ఎపిటిఎఫ్ అభ్యర్థి ఈసారి పోటీలో ఉండడం తనకు ఏమాత్రమూ నచ్చలేదన్నారు. అందుకే తాను ఎపిటిఎఫ్ అభ్యర్థికి కాకుండా యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతు ఇస్తున్నానని, ఉపాధ్యాయ లోకం దీనిని అర్థం చేసుకొని ఆమె విజయానికి బాసటగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కులు, సమస్యలపై నికరంగా పనిచేసే వ్యక్తి విజయగౌరి మాత్రమేనని అన్నారు. గతంలో గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు ఉపాధ్యాయుల సమస్యలను కనీసం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు అందరూ ఐక్యమై, సంఘాలను పక్కనపెట్టి పోరాడే వ్యక్తి విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు అప్పల రాము, సిహెచ్ సత్యం, గోవింద, రమాదేవి, నాగమణి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి మండలంలో ప్రచారంలో పాల్గొన్న ఎపిటిఎఫ్ సీనియర్ కార్యకర్త ముత్యాల నాయుడు

ఇవిఎంల గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా ఎస్‌పి కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఇవిఎంల గొడౌన్‌ను జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మంగళవారం తనిఖీ చేశారు. గొడౌను సీళ్లను, సిసి కెమెరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యకమంలో జిల్లా రెవిన్యూ డివిజినల్ అధికారి వై.సత్యనారాయణరావు, రెవిన్యూ డివిజినల్ అధికారి షేక్ ఆయిషా, జిల్లా అగ్నిమాపక అధికారి పి.నాగేశ్వరరావు, ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు ఎస్ఎస్‌వి.నాయుడు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇవిఎంల గొడౌన్‌ను వద్ద కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

మాట్లాడుతున్న ఎఎంఎఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు

ఇంటర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ముందుగా ఇంటర్ పరీక్షలు చక్కగా రాసి, మంచి స్థాయిలో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఇంటర్ తరువాత ఏ కోర్సులలో జాయిన్ అయితే బాగుంటుందో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా హుషారుగా గడిపారు. అనంతరం ఇంటర్ ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు విక్టర్, డాక్టర్ హరిబాబు, లెఫ్టినెంట్ కొండలరావు, డాక్టర్ స్వామినాయుడు, సాగర్, శ్యామల, డాక్టర్ వేణుగోపాల్, సూరిబాబు, జ్యోతి, సూపరింటెండెంట్ పి.పిఅనురాధ, మహిళా సాధికారత కో ఆర్డినేటర్ సామ్రాజ్యం, ఇంటర్మీడియట్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ కెప్టెన్ దాడి జగదీష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం, వల్లూరు గ్రామం పరిధిలో గ్రామ శివారున గౌరమ్మ గడ్డ కాలువ దగ్గర అనకాపల్లి మండలం వల్లూరుకు చెందిన ఎర్ర నాగరాజు వద్ద 15 లీటర్ల నాటు సారాను అనకాపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ లక్ష్మునాయుడు తమ సిబ్బందితో కలిసి దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి వినియోగించే 20 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ మేరకు నాగరాజును అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టులో హాజరుపరచగా కోర్టు అతనికి మంగళవారం 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది.

ఘనంగా అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండల కేంద్రం బుచ్చయ్యపేటలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎడ్ల పరుగు పందెం పోటీలు, మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి- పరవాడ : మండల కేంద్రం పరవాడలో శ్రీపరదేశమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని జనసేన నేత పంచకర్ల ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరవాడ పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, మాజీ జడ్పీటీసీ పైల జగన్నాధరావు, ఆర్ఇసిఐఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకారావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, బుగిడి గోవింద్, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, వర్రి హరి, రెడ్డి ఎర్రినాయుడు, పైల సురేష్, గండి నమో, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపిపి దంపతులు

మండలానికి ఒక గ్రామంలో

నూరు శాతం ప్రకృతి వ్యవసాయం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పూర్తిగా ప్రకృతి వ్యవసాయం గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. 2025 ఖరీఫ్ సంవత్సరానికి ప్రకృతి వ్యవసాయం లక్ష్యాలపై జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు అభివృద్ధి చేయడానికి రానున్న రెండు నెలలలో చేయవలసిన పనులపై ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయుటకు కావలసిన వనరులు గ్రామాలను ముందుగా గుర్తించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయానికి వనరుగా అవసరమైన గోసంపదకు సంబంధించిన సమాచారం పశు సంవర్ధకశాఖ వారి నుండి తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందే సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, రైతులు ప్రకృతి వ్యవసాయానికి మారే విధంగా ప్రోత్సాహించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని, వాటి వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రానున్న 15 రోజులలో పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలన్నారు. ఇతర గ్రామాలలో రసాయన ఎరువుల వినియోగ, విక్రయాలు కనిష్టస్థాయికి తీసుకురావాలని కోరారు. రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు, రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజరు సిహెచ్.లచ్చన్న, మండల వ్యవసాయ అధికారులు, డిఆర్‌డిఎ ఎపిఎంలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

శతశాతం ఇ-పంట నమోదు చేయాలి

రైతు పంటను నూరు శాతం ఇ-పంటలో నమోదు చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇ-పంట నమోదుపై మండలాల వారీగా మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 32వేల ఎకరాలకు సంబంధించి 84 శాతం ఇ-పంట నమోదు పూర్తయిందని, 28వ తేదీలోగా నూరుశాతం ఇ-పంట నమోదుతో పాటు, ఇకెవైసి కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, డివిజను, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని రైవాడకి చెందిన లారీ డ్రైవరు వారాది రమణ (30) అనుమానస్పద స్థితిలో మతి చెందాడు. వివాహేతర సంబంధమే అతని మృతికి కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం... రైవాడ గ్రామానికి చెందిన లారీ డ్రైవరు వారాది రమణకు సుమారు పదేళ్ల కిందట బొబ్బిలి సమీపంలోని కొమరాడకు చెందిన కృష్ణవేణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. మద్యానికి బానిసైన రమణ రైవాడ గ్రామానికి చెందిన వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్యా భర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. అనేక సార్లు పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చారు. సుమారు మూడు నెలల కిందట ఇదే విషయమై వివాదం తలెత్తడంతో స్థానిక పోలీసుస్టేషన్లో రమణ భార్య కృష్ణవేణి ఫిర్యాదు చేశారు. అయినా రమణలో మార్పు రాకపోవడంతో కృష్ణవేణి పిల్లల్ని తీసుకుని తన పుట్టింటికి రెండు నెలల కిందట వెళ్లి పోయింది.

వారాది రమణ (ఫైల్‌ఫొటో)

రమణ తల్లి చిన్నమ్మలు కూలి పనులు చేసుకుంటూ విశాఖలో జీవనం సాగిస్తోంది. ఇంటి దగ్గర ఒంటరిగా ఉంటున్న కుమారుడు రమణతో ప్రతి రోజు ఫోనులో మాట్లాడేది. ఆదివారం నుంచి ఎన్ని సార్లు ఫోను చేసినా తన కుమారుడు ఫోను ఎత్తకపోవడంతో చిన్నమ్మలు తమ బంధువులకు ఫోను చేసి తన కుమారుడి గురించి ఆరా తీసింది. ఇంటిలో లైట్లు వేసి ఫ్యాను తిరుగుతోందని, ఎంత పిలిచినా ఎవరు పలకలేదని వారు చెప్పారు. అనుమానం వచ్చిన చిన్నమ్మలు మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి వచ్చి ఇంటి తలుపులు తెరిచి చూసే సరికి కుమారుడు రమణ మృతి చెంది ఉన్నాడు. మృతదేహం భరించలేని దుర్వాసన వస్తోంది. దీంతో తల్లి చిన్నమ్మలు లబోదిబోమంటూ రోధించింది. తన కుమారుడితో వివాహేతర సంబంధం ఉన్న వారే హతమార్చి ఉంటారని మృతుడి తల్లి చిన్నమ్మలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ టి.మల్లేశ్వరావు, అదనపు ఎస్ఐ పి.రాములమ్మ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ రమణ మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నామని, అతనిని ఎవరైనా హత్య చేశారా? సాధారణంగా మృతి చెందాడనే విషయం తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తాచేరు కల్వర్టు వద్ద చెరుకు లారీ బోల్తా

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు కల్వర్టుపై మంగళవారం చెరుకు లారీ బోల్తా పడింది. ఘాట్ రోడ్డ చెరుకు కాటా నుండి గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి మంగళవారం చెరుకు తీసుకెళ్లున్న ఎపి 271737 నెంబర్ గల లారీ విజయరామరాజుపేట కల్వర్టు దాటుతున్నప్పుడు అదుపు తప్పి బోల్తా పడింది. మరమ్మతులు కారణంగా మూడు రోజులుగా ఫ్యాక్టరీ ఆగింది. మంగళవారం నుండి చెరుకు రవాణా మొదలైంది. దీంతో చెరుకు లారీ లోడ్లు అధికంగా కట్టడంతో తాచేరు వద్ద ఉన్న కల్వర్టుపై ఉన్న గోతులకు లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్ లారీ నుండి దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. లారీ బోల్తా సమయంలో పక్కన ఎవరు లేకపోవడంతో ఎటువంటి నష్టం కలగలేదు.

బోల్తా పడిన చెరుకు లారీ

రాజాంలో విద్యుత్ సమస్యలు

- లైన్‌మ్యాన్ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామంలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి. ఆ గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ సమస్యల పరిష్కారం కావడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైన్లు బ్రేక్ డౌన్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడల్లా పునరుద్ధరణకు కొన్ని గంటల సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు సర్పంచ్ మరిసా నాని తెలిపారు. చీకటిలో చిల్లర దొంగతనాలు పెరిగిపోయాయని, రాత్రంతా ప్రజలు చీకట్లోనే ఉన్నారని తెలిపారు. సచివాలయంలో జూనియర్ లైన్మెన్ ఒక్కరే ఉండడం వలన ప్రజలకు విద్యుత్తు సమస్యల పరిష్కారం కావడం లేదని, ఇప్పటికైనా ఏపిఈపిడిసిఎల్ అధికారులు స్పందించి రాజాంలో ఖాళీగా ఉన్న లైన్మెన్ పోస్టును భర్తీ చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

శివాలయం నిర్మాణానికి సిమెంట్ విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం

మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన దొడ్డి వెంకట అప్పారావు తన తండ్రి దొడ్డి పరదేశి జ్ఞాపకార్థంగా 200 సిమెంట్ బస్తాలు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బర్ల రమణ, గెద్దం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, కోరాడ శ్రీనివాసరావు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, ముర్రి కనకరాజు, కోరాడ రమేష్ పాల్గొన్నారు.

పిఎంజెజెవై ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన ఎస్.కృష్ణకు పిఎంజెజెవై పథకంలో రూ.2 లక్షలు ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్లు కసిరెడ్డి అప్పారావు, గణేష్ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చౌడువాడ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్ బాబు, ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున్ మంగళవారం బాధ్యత కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సాయం చెక్కును అందించారు.

రూ.2 లక్షల చెక్కును అందిస్తున్న దృశ్యం

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

కోటవురట్లలో శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి -కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గడచిన వారం రోజులుగా నిర్వహిస్తున్న అంగన్వాడీల జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఎంఇఒ రామారావు మాట్లాడుతూ అంగన్వాడీలకు వారం రోజుల శిక్షణలో జ్ఞాన జ్యోతి పేరిట విద్యాబోధనతోపాటు చిత్రలేఖనం క్రాఫ్ట్ వంటి అంశాలలో తర్ఫీదునిచ్చారని, వాటిని ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో అమలు పరిచి, చిన్నారులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ దుర్గ భవాని, పాఠశాల హెచ్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా అంగన్వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ మంగళవారంతో ముగిసాయి. ఎంఇఒలు నరేష్, నూకరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు లలిత, సత్యవతి, రిసోర్స్ పర్సన్‌లు ప్రసాదు, వరాల బాబు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆరిపాక జెడ్‌పి హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. 120 రోజుల అంగన్వాడీ సర్టిఫికెట్ కోర్స్‌లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు ఎస్ఎఎల్‌టి, ఈసీసీఈ, ఐసిడిఎస్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామని ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, రవీంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌పిఎస్ ఎన్.అప్పలనాయుడు, జిటి సూరిబాబు, అంగన్వాడీ సూపెర్వైజర్ జి.పైడితల్లి, కోర్స్ డైరెక్టర్, హెచ్ఎం రాధాకుమారి, అరిపాక సర్పంచ్, చైర్మన్, సిఆర్‌పిలు ఎన్.కళాభారతి, ఆర్ రమణ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్లో ఆరు రోజుల పాటు అంగన్వాడీలకు జరిగిన జ్ఞాన జ్యోతి శిక్షణమంగళవారం ముగిసింది. ఎంఈఓ-2 కాశీ విశ్వేశ్వరరావు, హెచ్ఎం శేషుబాబు, టివి శేషగిరిరావు, సిఆర్పిలు, డిఆర్పిలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ ముగింపులో విశాఖపట్నం జోన్-1 ఆర్‌జెడి విజయభాస్కర్ మాట్లాడుతూ నేర్చుకున్న ప్రతి అంశాన్నీ క్రమం తప్పకుండా గ్రౌండ్ లెవెల్‌లో అమల పరచాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.కార్యక్రమంలో ఎంఇఒ-1 జోగేంద్రనాథ్, ఎంఇఒ-2 గంగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్నాయక్, డిఆర్‌పిలు ఉమామహేశ్వరరావు, రాంబాబు, రత్నం, రేఖ వాణి, సిఆర్‌పిలు శివాజీ, గౌరీ శంకరరావు, బి.దుర్గ పాల్గొన్నారు.

గాజువాక : అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషిచేస్తుందని విశాఖ డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. నడుపూరు హైస్కూల్లో ముగింపు కార్యక్రమంలో డిఇఒ మాట్లాడుతూ, పాఠశాల విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. చిన్నారులను ఉత్తేజ పరచడానికి ఆటపాటలతో కూడిన విద్య అవసరమన్నారు. పెందుర్తి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి డి.నీలవేణి, ఎంఇఒ ఇ.శ్రీనివాసరావు, కె.రమణ, నడుపూరు హైస్కూల్ హెచ్ఎం ఆర్.శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.సుజాత, ఎ.లక్ష్మి, వెంకట రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధార ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జ్ఞానజ్యోతి ముగింపులో సిడిపిఒ శారద సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, కెఆర్.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మండలం వేములపూడి ఏపి మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. వచ్చేనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఒసి, బిసి విద్యార్థులు రూ.150, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.75 www.apms.ap.gov.in వెబ్‌సైట్‌లో చెల్లించి వివరాలు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. తర్వాత దరఖాస్తు పత్రంతో పాటు కుల, విద్యార్హతల ధ్రువీకరణలు జత చేసి పాఠశాలలో అందజేయాలన్నారు.

స్కౌట్స్ విద్యార్థులకు యుఐడి

స్కౌట్స్ విద్యార్థులతో ఆర్గనైజింగ్ కమిషనర్

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం **స్కౌట్స్ అసిస్టెంట్ ఆర్గనైజింగ్** కమిషనర్ అహ్మద్ షరీఫ్ సందర్శించారు. పాఠశాలలో విజయవంతంగా నడుపుచున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించి సంతృప్తిని వ్యక్తం చేశారు. దేశంలో ప్రతి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థికి ఒక యుఐడి గుర్తింపు ఉంటుందని, దాని ద్వారా ఆ విద్యార్థి దేశంలో ఎక్కడికెళ్ళినా ఆ ఐడితో ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. ప్రవేశిక పూర్తి చేసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 53 మందికి యుఐడి క్రియేట్ చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతంశెట్టి సత్యారావు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్స్ పి.శేఖర్, ఎం.హరితకుమారి పాల్గొన్నారు.

చౌకబారు ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : కక్షసాధింపుల గురించి నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. మంగళవారం మాట్లాడుతూ. వైసీపీ హయాంలో తాను పలు సమస్యలపై మాట్లాడితే తన ఇళ్లు, ఫ్యాక్టరీ వద్ద విధ్వంసం చేసిన విషయం మరిచారా అని ప్రశ్నించారుతాను గ్రామాల్లో పర్యటించినప్పుడు సమస్యలపై మాట్లాడితే ఆ గ్రామ మహిళలు, చిల్లర వ్యక్తుల చేత బూతులు తిట్టించారన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు కక్ష సాధింపులు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గణేష్ ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్ల కాలంలో తనపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టారని, వేధింపులకు గురిచేశారో గుర్తు తెచ్చుకోవాలన్నారు. అభివృద్ధి కోసం మాట్లాడే అర్హత, స్పీకర్ అయ్యన్నపాత్రుడును విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు లేదని, ఇప్పటికైనా చౌకబారులు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

ఉపమాక పుష్కరిణిలో నాచు తొలగింపు

నాచును తొలగిస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక పుష్కరిణిలో నాచు, గడ్డి తొలగింపు పనులు చేపట్టారు. ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలు వచ్చేనెల 9 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకునే ఆనవాయితీ ఉన్న నేపథ్యంలో, పుష్కరిణి అంతా నాచు, గడ్డిమయం కావడంతో భక్తులు స్నానాలు ఆచరించేందుకు కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలనకు వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితపుష్కరిణి పరిశీలించారు. పుష్కరణి పరిశుభ్రం చేసి, భక్తులు స్నానాలు ఆచరించేందుకు జల్లు స్నానం ఏర్పాటు చేయాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించడంతో ఆలయ అధికారులుపుష్కరిణిలో నాచు తొలగింపు చర్యలు చేపట్టారు. రాజయ్యపేట మత్స్యకారులు పుష్కరిణిలో గడ్డి, నాచు తొలగింపు పనులు మంగళవారం ప్రారంభించారు.

ఆయిల్‌ఫామ్ దిగుబడులపై అవగాహన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో ఆయిల్ ఫామ్ దిగుబడులపై రాజుపేట గ్రామంలో రైతులకు మంగళవారం పతంజలి ఫుడ్స్ మేనేజర్ టీవీ రమణ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు, ఈ సందర్భంగా మలేషియా ప్రతినిధి హాజీ అజ్మన్ మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ సాగుకు మలేషియా, భారత్‌లో వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేపడుతున్నామన్నారు. సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ఇక్కడి పరిస్థితులకు అనుకూలమైన కొత్తరకం వంగడాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. పంట దిగుబడులు పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మలేషియాలో వందేళ్లకుపైగా ఆయిల్‌ఫాం సాగులోందని, భారత్‌లో ఇటీవల కాలంలో పంట విస్తీర్ణం పెరిగినట్లు తెలిపారు, ఆయిల్ ఫామ్ రైతులను ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని పతాంజలి ప్రతినిధి రమణ అన్నారు, కార్యక్రమంలో వివిధ మండలాల ఆయిల్‌ఫాం కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శూలాల సంబరం

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లిలో పద్మశాలీల కులదైవం భావనారుషి శూలాల సంబరాన్ని సోమవారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు నాలికపై శూలాలు గుచ్చుకుని, నృత్యం చేస్తూ తమ భక్తిని చాటుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, సంబరాన్ని తిలకించారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.

రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం నవ నిర్మాణ సమితి కార్యాలయంలో మంగళవారం గంధం ఆగ్రో ఫుడ్స్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ రైతుసభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంధం ఫౌండేషన్ సిఇఒ గంధం లక్ష్మిసునీత మాట్లాడుతూ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఏడు ప్రాజెక్ట్ ద్వారా పలు సంస్థలతో కలిసి ఇరవై ఏళ్లుగా మార్కెటింగ్ కార్యక్రమాలునిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో నవ నిర్మాణ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో జీడి పండ్లతో జ్యూస్ తయారీ కేంద్రాన్ని, జీడిపిక్కల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఈ ప్రాంతంలో నెలకొల్పుతామని, రైతులకు అవసరమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాలలో పండే పంటలను కూడా మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వారికి ఆర్థిక సహకారాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందిస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.శివకుమార్, కార్యదర్శి గంధం ఫౌండేషన్ ఆర్థిక సలహాదారుడు రామకృష్ణ, లిఫ్ట్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి సిహెచ్‌విఎస్‌ఆర్.ప్రసాద్, వేమా ఎన్జీవో కార్యదర్శి బోళెం శివ, చంద్ర మాలకొండయ్య, కరణం దేవి, ప్రసాద్, హెల్ప్ సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, విజెఎన్‌ఎన్‌ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగించాలని వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని కాగిత గ్రామ రెవెన్యూ పరిధి లోని కిట్టయ్య చెరువు (పెద్ద చెరువు) ఆక్రమణలు తొలగించాలని రైతుల కోరారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో తహసిల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. చెరువు ఆక్రమణకు గురికావడం వల్ల సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. సర్వే చేపట్టి, ఆక్రమణలు తొలగించాలని కోరారు.

సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి -కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు నుండి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు అన్నారు, మంగళవారం తంగేడు గ్రామంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు, పారిశుధ్యం, సంపద కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రఘురాం, పలువురు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కాశీవిశ్వనాథరావు

అన్నప్రసాదాన్ని అందించలేకపోతున్నాం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో అభ్యంతరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రావికమతం : ఉత్తరాంధ్ర. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున ఈ ఏడాది కల్యాణపులోవ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు అందించలేకపోతున్నామని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు తెలిపారు. మండలంలోని చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవలో కల్యాణలోవ పోతురాజుబాబు, పెద్దింటి అమ్మవార్ల ఆలయాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఏటా అన్నప్రసాదాలు పంపిణీ ఆనవాయితీగా చేసేవారమని, ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా ప్రజా ప్రతినిధులెవరూ ప్రత్యక్షంగా ఇటువంటి కార్యక్రమాల్లో వీలులేనందున భక్తులందరూ గమనించాలని కోరారు. అసౌకర్యానికి భక్తులు మన్నించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజానా కొండనాయుడు, బంటు శ్రీనివాసరావు, సర్పంచ్ జోగిపాత్రుడు, కోట సత్యనారాయణ, మరుపాక మోడల్ స్కూల్ చైర్మన్ కాసేటి రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

నూకతాత జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో నూకతాత జాతరకు మత్స్యకారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ మత్స్యకారుల కులదైవం నూకతాత పండుగను మత్స్యకారులు ఏటా మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ. నూకతాత జాతరలో భాగంగా బుధవారం కోదండ రామాలయంలో భజన, ప్రత్యేక పూజలు, రాత్రికి బాణాసంచా పేలుళ్లు, అనంతరం డాన్స్ బేబీ డాన్స్, గురువారం ఉదయం 9 గంటల నుండి మూడు గంటల వరకు నూకతాత ఘటాలు ఊరేగింపు, మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో భారీ విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. నూకతాత జాతర సందర్భంగా వలసలు వెళ్లిన మత్స్యకారులు గ్రామానికి చేరుకున్నారు.

సూక్ష్మ కళాకారుల ప్రతిభ

పెన్సిల్ ముల్లు, చెక్కలపై శివుని ఆకృతులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మహాశివరాత్రి సందర్భంగా మండలంలో చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారులు శివుని ఆకృతులు అద్భుతంగా తీర్చిదిద్ది భక్తిని చాటుకున్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత గట్టెం వెంకటేష్ పెన్సిల్ముళ్ళుపై శివతాండవం ఆకృతులను 10 గంటలు శ్రమించి అద్భుతంగా ఆవిష్కరించాడు. అదేవిధంగా మరో సూక్ష్మ కళాకారుడు దార్ల రవి చెక్కతో శివలింగాన్ని చెక్కి తన కళా నైపుణ్యాన్ని చాటుకున్నాడు.

ఘనంగా టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్

ఆటపాటలతో సందడి చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-నక్కపల్లి : నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి వీడ్కోలు కార్యక్రమం హెచ్‌ఎం రాణీలలిత, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల ఆశీస్సులు తీసుకున్నారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు. అనంతరం విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో పాటు, పలు సినీ గేయాలకు డాన్సులు అదరగొట్టారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఫేర్‌వెల్‌లో విద్యార్థులంతా ఉల్లాసంగా పాల్గొన్నారు.

డాక్టర్ హరిప్రవీణ్‌కు ఆత్మీయ వీడ్కోలు



డాక్టర్ హరిప్రవీణ్‌ను సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట పిహెచ్‌సిలో ఐదేళ్లగా వైద్యాధికారి విధులు నిర్వహించి, విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎనస్థీషియన్ పిజి కోర్సులో ప్రవేశానికి అర్హత సాధించిన డాక్టర్ ఎన్.హరిప్రవీణ్‌కు మంగళవారం అల్లూరి పార్కులో పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.గాయత్రి ఆద్వర్యంలో అత్మీయ అభినందన, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మైదాన ప్రాంతాల రోగులకు అంకిత భావంతో సేవలందించిన డాక్టర్ హరిప్రవీణ్ సేవలను కొనియాడారు.. అనంతరం శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గొలుగొండ వైద్యాధికారులు శ్యామ్ కుమార్, కీర్తి, డౌనూరు వైద్యాధికారి వరప్రసాద్, హరిప్రవీణ్ సతీమణి సౌమ్య, విశ్రాంత ఆర్‌అండ్‌బి ఇఇ కే శవరావు, విశ్రాంత హెచ్‌ఎం జి.రత్నాజీ, పిహెచ్‌ఎన్ ఎల్.సావిత్రి, హెచ్‌వి వరలక్ష్మి, పి.లక్ష్మి, ఎంపిహెచ్ఓ సత్యనారాయణ, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్యాణపులోవ జాతరకు వేళాయె!

కల్యాణపులోవ రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన స్నానపు ఘాట్‌లు

- నేటి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి
- తొమ్మిది స్నానపు ఘట్టాలు సిద్ధం
- 350 మంది పోలీసులతో పటిష్ట భద్రత
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు

ప్రజాశక్తి -కొత్తకోట: మహాశివరాత్రి సందర్భంగా రావికమతం మండలం కల్యాణపులోవలో కల్యాణ పోతురాజు పెద్దింటమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 26, 27, 28 తేదీలలో మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు.లక్షల మంది భక్తులు తిరునాళ్లలో పాల్గొని, కల్యాణపులోవ జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరణ, అనంతరం కల్యాణ పోతురాజుబాబు, పెద్దింటమ్మ ఆలయాలను దర్శించుకుంటారు. రిజర్వాయర్‌లో భక్తులు స్నానాలు ఆచరించేందుకు సుమారు తొమ్మిది స్నానపు ఘట్టాలు ఏర్పాటు చేశారు. భక్తుల స్నానాలకు వీలుగా తొమ్మిది స్నానఘాట్లను సిద్ధం చేశారు. దేవా దాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బుధ, గురువారాలలో భక్తులకు ఆలయం వద్ద అన్న ప్రసాదం అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

350 మంది పోలీసులతో భద్రత

భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలలో భాగంగా 350 మంది పోలీస్‌లతో భద్రత కల్పిస్తున్నట్లు కొత్తకోట సిఐ జి. కోటేశ్వరరావు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు జలాశయం స్నాన ఘట్టాల వద్ద, ఆలయం క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా భద్రత కల్పిస్తారన్నారు.కొత్తకోట నుంచి కల్యాణపులోవ ఆలయం వరకూ అన్ని కూడళ్లలో పోలీసుల భద్రత ఉంటుందన్నారు.ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా ఆటోలు, కార్లకు అనుమతి లేదని, బైక్‌లను దొండపూడి చెక్ పోస్టు వద్ద నిలుపు చేస్తామని సిఐ కోటేశ్వరరావు తెలిపారు.

ప్రత్యేక ఆర్‌టిసి సర్వీస్‌లు

మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి తెలిపారు. ఈ నెల 25 సాయంత్రం నుంచి 27వ తేదీ సాయంత్రం వరకు ధారమఠం, కల్యాణపులోవ, ఎస్.కోటలోని పుణ్యగిరి క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నర్సీపట్నం డిపో నుంచి కల్యాణపులోవకు 40, ధారమఠానికి 10 మొత్తం 50 బస్సులు వేశామని, అలాగే అనకాపల్లి డిపో నుంచి కల్యాణపులోవకు 35, పుణ్యగిరికి 10, మొత్తం 45 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి కల్యాణపులోవకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నర్సీపట్నం నుంచి 15 కొత్తకోట నుంచి 10, రావికమతం నుంచి 10, కశిరెడ్డిపాలెం నుంచి 3, కొంతలం నుంచి రెండు బస్సులు నడుపుతున్నామని నర్సీపట్నం డిఎం ధీరజ్ తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

మాడుగుల : మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు పురాతన శివాలయాలు ముస్తాబయ్యాయి. కేజేపురం దబ్బా గుంట రోడ్డు పంట పొలాల్లో కొలువుతీరిన పార్వతీ భీమలింగేశ్వర స్వామి, .అడవిలో ఉబ్బలింగేశ్వర స్వామి, గుప్త లింగేశ్వర స్వామి, ఉమాభీమలింగేశ్వర స్వామి, ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి, కేజే పురం, జంపెన, పిట్ట తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలను విద్యుద్దీపాలం కరణతో తీర్చిదిద్దారు. భక్తుల దర్శనాలకు, ప్రసాద వితరణకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సబ్బవరం : జిల్లాలోని ప్రసిద్ధి శైవ క్షేత్రంగా విరజల్లుతున్న సబ్బవరం మండలం దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో మహా శివరాత్రి సందర్భంగా కొండమీద శివాలయం, దక్షవాటికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగులతో పాటు వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తున్నారు. శివాలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుండి పూజలు జరగనున్నాయి.

చకచకా రహదారుల మరమ్మతులు

మరమ్మతులు పూర్తయిన రోడ్డు

ప్రజాశక్తి- మాడుగుల : గోతులతో అధ్వానంగా తయారైన రహదారుల మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం చేయడంతో నిండా గోతులమయం, అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు నానా ఇబ్బందులకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ నిధులు విడుదల చేయడంతో అధ్వానరోడ్లలో గోతులు పూడ్చి తారురోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల కావడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మాడుగుల మండలంలో ఆరు రోడ్లకు రూ.90 లక్షలు మంజూరయ్యాయి. రావికమతం నుంచి కింతలి, వీజేపురం నుంచి ఒమ్మలి, మాడుగుల బ్రాంచ్ రోడ్డు, ఎం.కోడూరు నుంచి ఖండివరం, జాలంపల్లి రోడ్లపై గోతులను పూడ్చి మరమ్మతులు చేస్తున్నారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా ఉషశ్రీ

మూడు విభాగాల్లో పతకాల కైవసం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విజయవాడ క్లబ్ మైదానం నిర్వహించిన ఎపి స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలలో సింగిల్స్, మిక్స్‌డు డబుల్స్, ఉమెన్స్ డబుల్స్. మూడింటిలోనూ విజయం సాధించినవిశాఖపట్నానికి చెందిన పెద్దిశెట్టి ఉషశ్రీ ట్రిపుల్ క్రౌన్‌తో ఛాంపియన్‌గా నిలిచింది. ఉమెన్స్ సింగిల్స్, మిక్స్ డబుల్స్, ఉమెన్స్ డబుల్స్ మూడు విభాగాల్లోనూ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించింది. 50+ ఏళ్ల ఉమెన్ సింగిల్స్ లో విజయవాడకు చెందిన ఇంద్రాణిని ఓడించి టైటిల్ గెలుచుకుంది. 50+ మిక్స్ డబుల్స్‌లో బివిఎస్‌కె. లింగేశ్వరరావుతో కలిసి బరిలోకి దిగిన ఉష, తన నైపుణ్యంతో మళ్లీ విజయాన్ని సాధించింది. ఇక ఉమెన్స్ డబుల్స్‌లో విజయవాడకు చెందిన పద్మతో జతకట్టి, టైటిల్ గెలుచుకుంది.

సాధించిన పతకాలతో ఉషశ్రీ

రాజకీయాల్లోనూ రాణింపు

క్రీడారంగంలో అద్భుత ప్రతిభను చూపించిన ఉషశ్రీ, విశాఖపట్నం నగరపాలక సంస్థలో 43వ వార్డు కార్పొరేటర్ గా కూడా ప్రజాసేవలో రాణిస్తున్నారు. పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో అద్భుతంగా రాణించిన ఉషశ్రీ, ఇప్పుడు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించింది. గతంలో భారత్ తరపున ఆడిన అనుభవం ఉన్న ఉషశ్రీ, ఇపుడు జాతీయ స్థాయిలో మాస్టర్స్ టోర్నీల్లో పతకాలను గెలుచుకునేందుకు సిద్ధమవుతోంది. సమర్ధమైన శిక్షణ, కఠోర సాధన, మునుపటి అనుభవం.. ఇవన్నీ కలిసి ఆమె విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. స్పోర్ట్స్ అంటే కేవలం ఆటలే కాదు, అవి మన జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఉషశ్రీ నమ్మకంగా చెబుతుంది. మాస్టర్స్ టోర్నీల్లోనూ అప్రతిహత విజయాలతో యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా, ప్రోత్సాహకంగా ఉషశ్రీ నిలుస్తున్నారు.

ముగిసిన అడ్‌హక్ కమిటీ సమావేశం

అడ్‌హక్ కమిటీలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ సమావేశంమంగళవారం విశాఖలో జరిగింది. సమావేశంలో అసోసియేషన్ ఆర్థికస్థితిగతులు, త్వరలో జరగబోవు నూతన కమిటీ ఎన్నికల విధివిధానాలు, సంఘం బైలాస్‌పై చర్చించారు. సమావేశంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు గొంప చంద్రమౌళి, రంధి సాధూరావు, రాజన వెంకటరావు, టి వీరారెడ్డి, కోడూరు నారాయణరావు, నెక్కంటి సత్యన్నారాయణ (సత్తిబాబు), మద్దాల రమేష్, షేక్ శిలార్, పిల్లా సూరిబాబు, జి వీరభద్ర రావు పాల్గొన్నారు తదుపరి సమావేశం ఈనెల 27న గురువారం జరగనుంది.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		